నేటి మ్యాచ్ | గుజరాత్ X ముంబై రా.7.30 నుంచి | వేదిక అహ్మదాబాద్



## సాయికిరణ్‌కు కాంస్యం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెంగళూరు వేదికగా జరుగుతున్న ఇండియా అథ్లెటిక్స్ గ్రాండ్‌ప్రి టోర్నీలో రాష్ట్రానికి చెందిన సాయికిరణ్ కాంస్య పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో సాయికిరణ్.. ఇనుపగుండును 15.15 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచాడు. సాయికిరణ్‌ను జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేశ్ ప్రత్యేకంగా అభినందించాడు.

## ఫైనల్లో టూటోరూట్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అరో రియాల్టీ టీ9 చాలెంజ్ టోర్నీలో టూటోరూట్, బంకర్ బస్టర్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. గచ్చిబౌలి బౌల్డర్‌హిల్స్ వేదికగా శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో టూటోరూట్ 2.5-1.5తో లావిస్టా క్రూసేడర్స్‌పై గెలువగా, హోరాహోరీగా సాగిన మరో సెమీస్‌లో బంకర్ బస్టర్స్ ప్లేఆఫ్స్‌లో సెమెట్రిక్‌ను ఓడించింది. సింగిల్స్‌లో రేయ్ నూరోన్హా (టూటోరూట్).. రామ్(క్రూసేడర్స్)పై గెలువగా, గౌతమ్.. శ్రీనివాసన్ మధ్య పోరు డ్రాగా ముగిసింది. డబుల్స్‌లో ఇరు జట్ల మధ్య పోరు సమమైంది.

## మనీషాకు స్వర్ణం

అమ్మాన్: ఏషియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణం దక్కింది. మహిళల 62 కిలోల విభాగంలో మనీషా భన్వాలా.. 8-7తో కిమ్ ఓక్జు (ఉత్తర కొరియా)ను ఓడించి పసిడి కైవసం చేసుకుంది. అంతిమ్ పంగాల్.. మహిళల 53 కిలోల విభాగంలో కాంస్యం సొంతం చేసుకుంది.

**చెన్నైని చెన్నైలో ఓడించాలని 17 ఏండ్లుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కల ఎట్టకేలకు నెరవేరింది. ఐపీఎల్ మొదటి (2008) సీజన్ తర్వాత బెంగళూరు.. చెన్నై సూపర్ కింగ్స్‌ను చిదంబరం స్టేడియంలో తొలిసారి మట్టికరిపించింది. శుక్రవారం చెపాక్ వేదికగా చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాట్‌తో ఆ తర్వాత బంతితో సమిష్టిగా రాణించిన ఆర్‌సీబీ.. ఈ సీజన్‌లో రెండో విజయాన్ని నమోదుచేసింది.**

*17 ఏండ్ల తర్వాత చెపాక్‌లో బెంగళూరుకు తొలి విజయం*

**ఛేదనలో తేలిపోయిన చెన్నై**

# బెంగ తీరింది



రజత్ (51)

చెన్నై: ఐపీఎల్-18ను గెలుపుతో ఆరంభించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) రెండో మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. శుక్రవారం చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు.. 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ.. 20 ఓవర్లలో 196/7 పరుగుల భారీ స్కోరు చేసింది. రజత్ పాటిదార్ (32 బంతుల్లో 51, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా ఫిల్ సాల్ట్ (16 బంతుల్లో 32, 5 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించాడు. భారీ ఛేదనలో చెన్నై.. బ్యాటింగ్ వైఫల్యంతో 20 ఓవర్లలో 146/8కే పరిమితమైంది. రచిన్ రవీంద్ర (41) ఒక్కడే ఫర్వాలేదనిపించాడు. రజత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### సమిష్టిగా బాదారు..

మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరుకు ఓపెనర్లు సాల్ట్, కోహ్లీ (30 బంతుల్లో 31, 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుగైన ఆరంభమే అందించారు. సాల్ట్.. ఖలీల్ తొలి ఓవర్లోనే బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో ఖాతా తెరిచాడు. అశ్విన్ రెండో ఓవర్లో 6, 4, 4తో 16 పరుగులు పిండుకున్నాడు. అయితే ఐదో ఓవర్లో బౌలింగ్ మార్పుగా వచ్చిన నూర్.. చెన్నైకి తొలి బ్రేక్‌నిచ్చాడు. వికెట్ల వెనుక ధోనీ మరోమారు మాయ చేయడంతో సాల్ట్ స్టంపౌట్ అయ్యాడు. మూడో స్థానంలో వచ్చిన పడిక్కల్ (14 బంతుల్లో 27, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు. అయితే అశ్విన్ 8వ ఓవర్లో వేసిన ఆఫ్ బ్రేక్ బంతిని ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా ఆడబోయిన పడిక్కల్.. గైక్వాడ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండో స్పెల్‌లో బంతినందుకున్న నూర్.. 13వ ఓవర్లో రెండో బంతికి కోహ్లీని ఔట్ చేశాడు. పడిక్కల్ స్థానంలో వచ్చిన సారథి పాటిదార్ మరోసారి ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. సీఎస్‌కే ఫీల్డర్లు మూడు క్యాచ్‌లు నేలపాలు చేయడంతో బతికిపోయిన అతడు.. లివింగ్స్టన్ (10), జితేశ్ (12) విఫలమైనా అతడు బెంగళూరు స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. రజత్ ఔట్ అయినా ఆఖర్లో టిమ్ డేవిడ్.. కరన్ వేసిన చివరి ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లు బాదాడు.

### చేతులెత్తేసిన చెన్నై..

బెంగళూరు ఇన్నింగ్స్‌కు పూర్తి విరుద్ధంగా చెనై బ్యాటింగ్ సాగింది. హెజిల్‌వుడ్ రెండో ఓవర్లో రాహుల్ త్రిపాఠి (5)తో పాటు కెప్టెన్ రుతురాజ్‌ను డకౌట్ చేశాడు. భువీ వేసిన ఐదో ఓవర్లో హుడా (4).. జితేశ్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. పవర్ ప్లే ముగిసేసరికి చెన్నై స్కోరు 30/3. స్పిన్నర్ల రాకతో చెన్నై పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టైంది. క్రీజులో రచిన్, దూబే ఉన్నప్పటికీ 12 ఓవర్లకు ఆ జట్టు స్కోరు 75/4గానే ఉంది. ఇక 13వ ఓవర్లో యశ్ దయాల్.. తొలి బంతికి రచిన్‌ను, ఐదో బంతికి దూబేను క్లీన్‌బౌల్డ్ చేయడంతో చెన్నై ఆశలు ఆవిరయ్యాయి. ఆఖర్లో ధోనీ (15 బంతుల్లో 26 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) క్రీజులోకి వచ్చి మెరుపులు మెరిపించడమొక్కటే చెన్నై అభిమానులకు ఊరట!

### సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు 20 ఓవర్లలో 196/7 (రజత్ 51, సాల్ట్ 32, నూర్ 3/36, పతిరాన 2/36); చెన్నై: 20 ఓవర్లలో 146/8 (రచిన్ 41, ధోనీ 30 నాటౌట్, హేజిల్‌వుడ్ 3/21, దయాల్ 2/18)

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| బెంగళూరు | 2 | 2 | 0 | 4 | 2.13 |
| లక్నో | 2 | 1 | 1 | 2 | 0.96 |
| పంజాబ్ | 1 | 1 | 0 | 2 | 0.55 |
| చెన్నై | 2 | 1 | 1 | 2 | 0.49 |
| ఢిల్లీ | 1 | 1 | 0 | 2 | 0.37 |
| హైదరాబాద్ | 2 | 1 | 1 | 2 | -0.12 |
| కోల్‌కతా | 2 | 1 | 1 | 2 | -0.30 |
| ముంబై | 1 | 0 | 1 | 0 | -0.49 |
| గుజరాత్ | 1 | 0 | 1 | 0 | -0.55 |
| రాజస్థాన్ | 2 | 0 | 2 | 0 | -1.88 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్



# 250 సరిపోవట్లే!

**మిగిలిన రెండు ఫార్మాట్లతో పోలిస్తే నాలుగు గంటల్లో ముగిసిపోయే పొట్టి క్రికెట్‌లో ప్రధానంగా బ్యాటర్లదే ఆధిపత్యం. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్ జరిగినా బ్యాటర్ల జోరు ముందు బౌలర్లకు పీడకలలు తప్పడం లేదు. ఒకప్పుడు పొట్టి ఫార్మాట్‌లో ప్రత్యర్థి ఎదుట 160, 180 లక్ష్యాన్ని నిర్దేశించి గెలుపు ఖాయం అనుకున్న జట్లు.. ఇప్పుడు 230, 250 కొట్టినా గెలుస్తామా? అన్న ఆందోళనలో ఉంటున్నాయి. ఈ సీజన్‌లో '300 స్కోరు సాధ్యమే!' అన్న అంచనాలున్న నేపథ్యంలో అంత స్కోరు చేసినా గెలుస్తామన్న దీమా అయితే ఫస్ట్ బ్యాటింగ్ చేసిన జట్లలో కనిపించడం లేదన్నది కాదనలేని వాస్తవం.**

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

సంప్రదాయక టెస్టు క్రికెట్‌తో పాటు ఆటగాళ్లను పరీక్షించే వన్డే ఫార్మాట్‌నూ తోసిరాజని గత కొన్నాళ్లుగా ఈ ఆటను ఏలుతున్న టీ20 క్రికెట్ అభిమానులను అలరిస్తుందనడంలో సందేహమే లేదు. ముఖ్యంగా అంతర్జాతీయ, దేశవాళీ స్టార్ల కలబోతలో బీసీసీఐ నిర్వహిస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్).. ఆటకు ఆట.. వినోదానికి వినోదం.. డబ్బుకు డబ్బు అన్న చందంగా 18 సీజన్లుగా విజయవంతంగా దూసుకుపోతోంది. ఈ లీగ్‌లో ప్రధానంగా బ్యాటర్లదే ఆధిపత్యం. స్టార్క్, రబాడా, వుడ్, బౌల్ట్, షమీ, కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి అంతర్జాతీయ స్థాయి బౌలర్లు సైతం గల్లీ స్థాయి బ్యాటర్ హిట్టింగ్ ముందు తలవంచక తప్పడంలేదు. పవర్ ప్లే నిబంధనలు, ఇంపాక్ట్ ప్లేయర్ వంటి రూల్స్‌కు తోడు పిచ్‌లు సైతం బౌలర్లకు పీడకలలను మిగుల్చుతున్నాయి. స్టేడియానికి వచ్చిన ప్రేక్షకుడిని నాలుగు గంటల పాటు ఎటూ కదలకుండా కూర్చోబెట్టడానికి గాను నిర్వాహకులు ఈ లీగ్‌లో పిచ్‌లను 'బ్యాటర్ ఫ్రెండ్లీ'గా తీర్చిదిద్దుతుండటంతో తొలుత బ్యాటింగ్ చేసి 230కు పైగా స్కోర్లు చేసిన జట్లు కూడా గెలుపుపై దీమాగా ఉండలేకపోతున్నాయి. దీంతో బౌలర్లు వికెట్లు తీయడం దేవుడెరుగు! ఆర్చర్‌లాగా బాదుడు బాధితుడు కాకుంటే చాలన్న ఆందోళనలో గడపాల్సిన పరిస్థితి!

### 250.. గెలుస్తామా?

గత సీజన్ నుంచి ఐపీఎల్‌ను సుమారు 13 నగరాలలో ఆడిస్తున్నారు. ఇందులో చెన్నై, లక్నో వంటి మూడు, నాలుగు స్టేడియాలలో మినహాయిస్తే అన్నీ బ్యాటింగ్ ఫ్రెండ్లీ పిచ్‌లే. దీంతో ఐపీఎల్‌లో 200+ స్కోర్లు సాధించడం అనేది ఇప్పుడు సర్వ సాధారణం. గత సీజన్‌లో ఏకంగా 38 సార్లు 200+ స్కోర్లు నమోదుకాగా 11 సార్లు 240, అంతకంటే ఎక్కువ స్కోర్లు రికార్డయ్యాయి. అయితే భారీ స్కోర్లు సాధిస్తున్నా మొదట బ్యాటింగ్ చేసిన జట్లకు గెలుపు మీద నమ్మకం ఉండటం లేదు. నిరుటి సీజన్‌లో కోల్‌కతా, పంజాబ్ మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్ (43వది)లో.. మొదట బ్యాటింగ్ చేసిన కేకేఆర్ 261/6 స్కోరు చేసింది. కానీ పంజాబ్ 18.4 ఓవర్లలోనే ఆ లక్ష్యాన్ని దంచేసింది. ఆ మరుసటి రోజే ఢిల్లీ, ముంబై మ్యాచ్ (44వ)లో క్యాపిటల్స్ మొదట బ్యాటింగ్ చేసి 257/4 చేస్తే ముంబై (247/9) దాదాపు గెలిచినంత పనిచేసింది. ఈడెన్ గార్డెన్స్‌లోనే కోల్‌కతా (31వ మ్యాచ్) నిర్దేశించిన 224 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ ఆఖరి బంతికి ఛేదించింది. 2024లోనే అత్యధిక పరుగులు నమోదైన హైదరాబాద్, బెంగళూరు మ్యాచ్ (30వది)లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ టోర్నీలోనే అత్యధిక స్కోరు (287) నమోదుచేసింది. ఛేదనలో బెంగళూరు (262/7) కూడా బాదడంతో ఆఖరి ఓవర్ దాకా రైజర్స్‌కు గెలుపుపై ఆశలే లేవు.

### ఈ సీజన్‌లోనూ అదే క(వ్య)థ!

వారం రోజుల క్రితమే అట్టహాసంగా మొదలైన ఐపీఎల్ 18వ సీజన్ అయితే ఆరంభం నుంచే భారీ స్కోర్లకు వేదికవుతున్నది. రెండో మ్యాచ్‌లో హైదరాబాద్.. 286 పరుగులు చేసినా రాజస్థాన్ (242) విజయానికి దగ్గరగా వచ్చింది. లక్నో నిర్దేశించిన 210 పరుగుల ఛేదనను ఢిల్లీ 3 బంతులుండగానే బాదేసింది. పంజాబ్, గుజరాత్ మ్యాచ్‌లోనూ భారీ స్కోర్లే నమోదయ్యాయి. లక్నోతో మ్యాచ్‌లో హైదరాబాద్ చేసిన స్కోరు తక్కువేమీ (190) కాకపోయినా బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై ఛేదనను లక్నో 16.1 ఓవర్లలోనే పూర్తిచేసింది. ఇక 160, 170 వంటి లక్ష్యాలనైతే జట్లు 16, 17 ఓవర్లలోపే ముగిస్తున్నాయి. ఆరంభంలో వికెట్లు పడ్డా లోయరార్డర్ బ్యాటర్ల సాయంతోనూ ఫినిషర్లు మ్యాచ్‌ను ముగిస్తున్నారు.

## హోరాహోరీగా జాతీయ కరాటే టోర్నీ






హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా 4వ కియో జాతీయ కరాటే చాంపియన్‌షిప్ హోరాహోరీగా సాగుతున్నది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్లేయర్లు వేర్వేరు విభాగాల్లో తమ అద్భుత ప్రదర్శనను కనబరుస్తున్నారు. పోటీలకు మూడో రోజైన శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సత్తాచాటిన ప్లేయర్లకు వీరు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. క్రీడా మైదానాల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని అన్ని వయసుల వారికి క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. వాటిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీబాలదేవి, స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ పాల్గొన్నారు.

## గురిందర్‌వీర్ @10.20 సెకన్లు

**100 మీటర్ల రేసులో జాతీయ రికార్డు**



బెంగళూరు: ఇండియన్ అథ్లెటిక్స్ గ్రాండ్‌ప్రి టోర్నీలో పంజాబ్ యువ అథ్లెట్ గురిందర్‌వీర్‌సింగ్ సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. శుక్రవారం ఉత్కంఠగా సాగిన పురుషుల 100మీటర్ల రేసును గురిందర్‌వీర్ సింగ్ 10.20 సెకన్లలో పూర్తి చేసి పసిడి పతకంతో మెరిశాడు. మణికంఠ హోబ్లిధార్ నిరుడు నెలకొల్పిన 10.23 సెకన్ల రికార్డును తాజాగా ఈ పంజాబ్ యువ అథ్లెట్ తిరుగరాశాడు. దీనికి తోడు 2021లో తన పేరిటే ఉన్న 10.27సెకన్ల రికార్డును సింగ్ సవరించాడు. చివరి దాకా ఆసక్తికరంగా సాగిన రేసులో గురిందర్ అగ్రస్థానంలో నిలువగా, మణికంఠ(10.22సె), అమ్లాన్ బొర్గోహైన్(10.43సె) రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. భారత 100మీటర్స్ టాప్ రేసర్‌గా కొనసాగుతున్న అనిమేశ్ కుజుర్ ఈ పోటీలో పాల్గొనలేకపోయాడు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.